క్లుప్తంగా

నిరుపేదకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం: తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఇటీవల మండలంలోని టి.సదుం పంచాయతీలో పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న టి.సదుంకు చెందిన చింతమాని నరసింహప్పను పరామర్శించారు. ఈ నేపథ్యంలో బాధిత నిరుపేదకు రూ.10 వేల నగదును అందించాలని పంచాయతీలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సూచించారు. ఈ తరుణంలో ఎమ్మెల్యే ఇచ్చిన నగదును ఆదివారం పంచాయతీకి చెందిన ఉప సర్పంచ్ పీఎస్ మధు, కార్యకర్తలు శ్రీరామ, రామచంద్ర, వెంకటేష్, నరసింహప్ప, శంకరప్పల చేతుల మీదుగా నిరుపేదకు అందించారు.

ప్రజలకు మళ్లీ రేషన్ కష్టాలు

– మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి



కలికిరి: ప్రజలకు మళ్లీ రేషన్ కష్టాలు తెచ్చిపెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 9వేలకు పైగా వాహనాలతో ఎండీయూ ఆపరేటర్లు ప్రతి నెలా నిత్యావసరాలను ప్రజల ఇంటి ముంగిటకే సరఫరా చేస్తుండగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా ఎండీయూ ఆపరేటర్‌లకు షాక్ ఇవ్వడంతో పాటు ప్రజలకు మరచిన కష్టాలు తిరిగి ప్రారంభమయ్యాయని విమర్శించారు. సజావుగా జరుగుతున్న సరఫరాను నిలిపి వేసి రేషన్ డీలర్ల వద్దే సరుకులు తీసుకునేలా చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఎండీయూ వాహనాల రద్దుతో సుమారు 20వేల కుటుంబాలు ఉన్నపళంగా రోడ్డున పడ్డాయని, వారి గోడు ప్రభుత్వానికి ప్రభుత్వానికి పట్టాదా అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఏ ఒక్క సంక్షేమ పథకమూ ప్రారంభించక పోగా.. ఉన్న పథకాలను రద్దు చేస్తుండటం శోచనీయమని, ప్రభుత్వం రేషన్ పంపిణీ వాహనాల రద్దును పునఃసమీక్షించి తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

హౌసింగ్ బృందం క్షేత్ర పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీఈ, అధికారులు

బి.కొత్తకోట: గృహ నిర్మాణాల్లో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆదివారం గృహ నిర్మాణశాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్.వేణుగోపాల్, జిల్లా అధికారులతో కలిసి మండలంలోని బీరంగి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. రాయచోటిలో అధికారులు, మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించాక బీరంగి గ్రామం ఎంపిక చేసుకుని ఇక్కడికి వచ్చారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న యూనిట్ విలువను పెంచి ఇస్తున్నప్పటికి ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయించలేకపోతున్న కారణాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధికారి వి.సాంబశివయ్య, ఈఈ రమేష్‌రెడ్డి, డీఈ వెంకటరెడ్డి, ఏఈలు లావణ్య, జియా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ద్రౌపది కల్యాణ నాటక ఘట్టం



పూజలు చేస్తున్న నిర్వాహకులు

మదనపల్లె సిటీ: మహాభారత మహోత్సవంలో భాగంగా ఆదివారం ద్రౌపది కల్యాణ నాటక ఘట్టం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రాంగణంలోని శ్రీకృష్ణుడు, పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ భాగవతారిణి స్వర్ణలత ద్రౌపది కల్యాణంలోని ఘట్టాలను వివరించింది. అలాగే సాయంత్రం వెంకటేశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో ద్రౌపది కళ్యాణ ఘట్టంను ప్రదర్శించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేష్, రామచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

చిన్నమండెం : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పక ఉంటుందని చిన్నమండెం సబ్ పోస్ట్‌మాస్టర్ భాస్కర్‌నాయక్ అన్నారు. చిన్నమండెం సబ్‌పోస్టాఫీస్ పరిధిలోని చాకిబండ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ కురియాల కృష్ణయ్య పదవీవిరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌నాయక్ పదవీ విరమణ తర్వాత కొత్త జీవితం ప్రారంభించాలని పేర్కొన్నారు. అనంతరం కృష్ణయ్య దంపతులను సన్మానించారు.

ఏడాదిలోనే చంద్రబాబు ప్రభుత్వం విఫలం

- మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి టీడీపీ
- ఓటువేసిన ప్రజలందరికీ వెన్నుపోటు
- జూన్ 4న సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వెన్నుపోటు దినం
- సబ్ కలెక్టర్ తొలగించమన్నా.. కేంద్రీయ విద్యాలయ స్థలంలో ఆగని ఆక్రమణలు



జూన్ 4 వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న నిసార్‌అహ్మద్, చైర్‌పర్సన్ మనూజారెడ్డి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ తదితరులు

మదనపల్లె రూరల్ : మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఏడాదికాలంలోనే అన్నివిధాలుగా వైఫల్యం చెందిందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ మండిపడ్డారు. జూన్ 4న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమం పోస్టర్‌ను స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....కూటమిప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏడాదికాలంలో ఒక్కటి కూడా పూర్తిగా అమలుచేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందన్నారు. ఏ ఒక్కరోజు కూడా ప్రజల గురించి ఆలోచన చేయని ఒక దుర్మార్గమైన పాలనను దేశంలో మొదటిసారి చూస్తున్నామన్నారు. ఐదుకోట్ల మంది ప్రజలను వెన్నుపోటు పొడిచి చంద్రబాబు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కనున్నాడని ఎద్దేవా చేశారు. కూటమిప్రభుత్వ పాలనలో సమాజంలోని ఏ వ్యక్తి..కానీ వర్గం కానీ సంతృప్తిగా లేరన్నారు. మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, యువత ఇలా చెప్పుకుంటూ పోతే.. అన్ని రంగాలకు చెందిన వ్యక్తులు చంద్రబాబు పాలనలో దగా పడ్డారన్నారు. రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, టమాటా, మామిడి పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి దాపురించిందన్నారు. మంత్రి నారాలోకేష్..యువగళం పాదయాత్ర సందర్భంగా..అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే మదనపల్లె నియోజకవర్గంలో టమాటా ప్రాసెసింగ్‌యూనిట్, కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుచేస్తామన్న హామీ నీటి మూటగానే మిగిలిపోయిందన్నారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తుండటం, పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు విలవిలలాడుతున్నారన్నారు. నిరుద్యోగ భృతి అందక నిరుద్యోగులు బాధపడుతుంటే....ఒక ఉద్యోగం ఇవ్వక పోగా ...వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్ల ఉద్యోగాలు పీకేసి కుటుంబాలను నడిరోడ్డుపైకి తీసుకువచ్చారన్నారు. మహిళలకు ఆర్టీసీబస్సులో ఉచిత ప్రయాణం ఊసే లేదన్నారు. పెన్షన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచామని గొప్పలు చెప్పుకుంటూనే, ఉన్నవాటిల్లో 25 శాతానికి పైగా తొలగించి పింఛనుదారులను నిలువునా మోసం చేశారన్నారు. కూటమిప్రభుత్వంపై రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ప్రజల్లో ఇప్పుడిప్పుడే చైతన్యం వస్తోందన్నారు. నిద్రపోతున్న టీడీపీ ప్రభుత్వాన్ని మేల్కొలిపి, ప్రజలకు ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచినందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం బేబీవెల్‌కంహోం వద్ద పెద్దసంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ప్రదర్శనగా బయలుదేరి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్ఆర్ఐ దండుశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ దండుకరుణాకర్ రెడ్డి, కేశవరెడ్డి, ఆర్ఐ రమణారెడ్డి, కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, శీలంరమేష్, మునిశేఖర్, కౌన్సిలర్ పాల్‌చంద్రశేఖర్, పోతబోలు నాగరాజ, కోఆప్షన్ శారదారెడ్డి, కొత్తపల్లె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ తొలగించమన్నా...

వైఎస్సార్ సీపీ లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కృషితో మదనపల్లెకు మంజూరైన కేంద్రీయ విద్యాలయం స్థలాన్ని కొందరు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తుండటం శోచనీయమన్నారు. ఆక్రమణదారులు ఏకంగా ప్రజాప్రతినిధి పేరుతో కాలనీ ఏర్పాటుచేసుకుని మరీ కబ్జా చేస్తుండటం దారుణమన్నారు. ఈ విషయమై సబ్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆక్రమణలు తొలగించాలని ఆదేశించినా ఆయన మాటకు విలువ ఇవ్వకపోగా, అక్రమ నిర్మాణాలు యధావిధిగా చేస్తుండటం దేనికి సంకేతమన్నారు. ఇప్పటికే ఈ ఆక్రమణల్లో లక్షల రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు ఉన్నాయన్నారు. కూటమిప్రభుత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకపోగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని అడ్డుకునేందుకు నాయకులు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కేంద్రీయ విద్యాలయానికి మంజూరు చేసిన స్థలంలో అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించి, కోట్ల విలువైన ప్రభుత్వస్థలాన్ని కాపాడాలన్నారు.

మెగా డీఎస్సీకి 5.5 లక్షల మంది అనర్హులు

- నార్మలైజేషన్ విధానం తొలగించాలి
- బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు

మదనపల్లె: మెగా డీఎస్సీ నిబంధనల ఫలితంగా ఒకటి, రెండు రోజుల వయసు తక్కువై రాష్ట్రంలో 5.50 లక్షల మంది నిరుద్యోగులు పరీక్ష రాసే అర్హత కోల్పోతున్నారని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఒక విధానమంటూ లేకుండా అస్పష్ట నిర్ణయాలతో నిరుద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే డీఎస్సీపై సమీక్షించాలని డిమాండ్ చేశారు. 16,347 పోస్టుల భర్తీకి ప్రభుత్వ నిర్వహిస్తున్న మెగా డీఎస్సీని 90 రోజులు వాయిదా వేయాలని కోరారు. నార్మలైజేషన్ పద్ధతిని రద్దుచేసి ప్రతిజిల్లాకు ప్రత్యేక ప్రశ్నప్రతంతో పరీక్షలు నిర్వహించాలని కోరారు. ప్రతిఏటా డీఎస్సీ పరీక్ష జరగనందున అభ్యర్థుల వయసు దాటి అనర్హులవుతున్నారు. ప్రతిఏటా డీఎస్సీ నిర్వహణ లేనందున నిబంధనలు సడలించడంతోపాటు టెట్ పరీక్షను ఏటా రెండుసార్లు నిర్వహించాలని కోరారు. తెలంగాణలో అభ్యర్థుల వయసు 47గా నిర్ణయించినట్టు రాష్ట్రంలోనూ కూడా 47కు పెంచాలని కోరారు.

లక్షలాది నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిబంధనలను సవరించి 90 రోజులు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలో విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగ సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో బహుజన సేన మద్దతుగా పాల్గొంటున్నట్టు చెప్పారు.

మున్సిపల్ పాఠశాలలో పదోన్నతులు, బదిలీలు



హెచ్‌ఎం శీనప్పను అభినందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ: మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించారు. వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఆర్‌ఆర్ లేవుట్) ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్‌ను వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల (మయాబజార్) ప్రధానోపాధ్యాయుడిగా బదిలీ చేశారు. హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మిని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఆర్‌ఆర్ లేవుట్) ప్రధానోపాధ్యాయురాలిగా బదిలీ చేశారు. పదోన్నతుల్లో హోప్ మున్సిపల్ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు శీనప్ప నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా, మునేనాయక్ బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా, శ్రీకాళహస్తి నుంచి దామోదర్ పప్పిరెడ్డిపల్లె మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పదోన్నతి పొందారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలలను విద్యాశాఖలోకి విలీనం చేయడం వల్ల బదిలీలు, పదోన్నతుల మార్గం సుగమమైంది. పదోన్నతులు, బదిలీలు పొందిన వారిని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, డివిజనల్ కన్వీనర్ సుధాకర్, మునిరాజ,జిలానీబాష, భానుమూర్తి తదితరులు అభినందించారు.

రెడ్డెమ్మకొండపై భక్తులకు రద్దీ



అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. రెడ్డెమ్మతల్లీ కాపాడమ్మా అంటూ ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతోఅమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానంతో పాటు పలు కోర్కెలు నెరవేరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయ ఈవో మంజుల భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

బెడిసికొట్టిన నీటి పథకం

- వేసవి అయిపోయాక..నీటి రవాణా కోసం టెండర్లు
- రూ.1.53 కోట్లతో ట్యాంకర్లతో సరఫరాకు ప్రయత్నం
- అడ్డుకట్టవేసిన కౌన్సిల్ నిర్ణయం

మదనపల్లె: వేసవి పేరుతో నీటిని కొనుగోలు చేసే పథకానికి నీటి సమస్య లేనప్పుడు టెండర్లు నిర్వహించిన వ్యవహారంపై కౌన్సిల్ నిర్ణయంతో మున్సిపాలిటికి రూ.1.53 కోట్లు మిగిలాయి. లేదంటే నీటి లభ్యత పుష్కలంగా ఉన్నప్పుడు నిధులు దుర్వినియోగం అయ్యేవి. ఈ ఏడాది వేసవిలో నీటి సమస్య పేరుతో మున్సిపల్ అధికారులు పట్టణంలోని పిఅండ్‌టీ కాలనీ, ఏవీనాయుడు కాలనీ, రామారావు కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, రామిరెడ్డి లేఆవుట్, అనపగుట్ట, వైఎస్ఆర్‌నగర్, ఎంఎంసీ, విక్లీ మార్కెట్, ముగ్గురాళ్ల వంక, వడ్డిపల్లె సంపులకు నీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. గతంలో లేని విధంగా ఈ వేసవిలో నీటి సమస్యలు లేవు. అయితే తాగునీటి బోర్లలో మోటార్లు పడిపోయిన ఘటనలు మినహా ఇస్తే నీటి సరఫరా సమస్యలు దాదాపుగా లేనట్టే. అయితే అధికారులు వర్షాలు పుష్కలంగా కురుస్తూ నీటి సమస్య లేనప్పుడు నీటి కొనగోళ్లకు మొగ్గు చూపించారు. పై సంపులను నాలుగు భాగాలగా విభజించి అధికారులు నీటి సరఫరా కోసం కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానించారు. దీనిపై ఇద్దరు కాంట్రాక్టర్లు లెస్‌తో టెండర్లు దాఖలు చేయగా వాటిని ఆమోదించి నీటి కొనుగోళ్లు ప్రారంభించాల్సివుంది. శనివారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఈ టెండర్లను ఆమోదించుకోవడం కోసం అధికారులు అజెండా అంశంగా పెట్టారు. దీనిపై కౌన్సిలర్లలో పలు అనుమానాలు రేకెత్తాయి. వేసవి లేకపోవడం, నీటి ఇబ్బందులు లేనందును ఈ టెండర్లను ఆమోదిస్తే నిధులు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్న చర్చ జరిగింది. శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో అజెండా అంశాల ఆమోదంపై జరిగిన చర్చలో నీటి రవాణా టెండర్లను వ్యతిరేకిస్తూ ప్రస్తుతం ఈ అవసరం లేదని చెబుతూ కౌన్సిల్ టెండర్లను రద్దు చేస్తూ తీర్మాణం చేసింది. దీనితో మున్సిపాలిటికి రూ.1.53 కోట్ల నిధులు మిగిలాయి.

మహల్ పాఠశాలకు తాగునీటి సౌకర్యం



మహల్ జెడ్పీ పాఠశాలలో తాగునీటి బోరును ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

కలికిరి: మండలంలోని మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో ఆ పాఠశాల 1985–86 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. గత నెల 11న పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి అవసరమైన సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేయనున్నట్లు ప్రకటించి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ద్వారా తెలుసుకున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఇటీవల తాగునీటి బోరు వేయించారు. ఆదివారం బోరుకు మోటారు, పైపులు ఏర్పాటు చేసి బోరు ప్రారంభించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్థానికులు పూర్వపు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు ఇ.వాసు, చింతల రమేష్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్, బోరు సుబ్బయ్య, గౌసు, ఖాదర్ వల్లి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోర్కెలు కోర్చే కల్పవల్లి కోర్టులో గంగమ్మ

- జాతరకు ఏర్పాట్లు పూర్తి
- మంగళవారం రాత్రి తిరునాల, బుధవారం పగలు తిరునాల



జాతరకు ముస్తాబయిన ఆలయ ఆవరణం

మదనపల్లె సిటీ: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కోర్టులో గంగమ్మ ప్రసిద్ధి కెక్కింది. జిల్లాలో అతి పెద్ద జాతరలో కోర్టులో గంగమ్మ జాతర ఒకటి. మదనపల్లె పట్టణం కోర్టు ఆవరణంలో వెలసిన గంగమ్మ జాతర మంగళవారం రాత్రి, బుధవారం పగలు జాతర ఘనంగా నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. నిత్యం భక్త పూజలు అందుకునే గంగమ్మకు ప్రతి సంవత్సరం వైభవంగా జాతర నిర్వహిస్తారు. సుమారు వందేళ్ల క్రితం గంగమ్మ ఆలయం ఇక్కడ వెలసింది. మదనపల్లె పరిసర ప్రాంతాల ప్రజలకు ఏదైనా శుభకార్యాలు తలపెట్టిన సమయంలో కోర్టులో గంగమ్మను దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. అనారోగ్యంతో బాధపడుతున్న, భూతప్రేత భయంతో భయపడే వారు ఇక్కడ పూజలు చేస్తే బాధలు తగ్గి సంతోషంగా ఉంటారని ఈ ప్రాంతవాసులు విశ్వాసం. ప్రతి మంగళ, శుక్రవారాల్లో రాహుకాలంలో నిమ్మకాయ మీద నేతి దీపాలు వెలిగిస్తారు. తద్వారా సర్వ అరిష్టాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఈ ఏడాది జాతర పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు.

ప్రత్యేక అలంకరణ

జాతర పురస్కరించుకుని ఆలయం వద్ద, బెంగుళూరు రోడ్డు, హెడ్‌పోస్టాఫీసు, హాస్పిటల్ రోడ్డు, కదిరిరోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, సొసైటీకాలనీ అమినేనివీధి, కజిన్స్ రోడ్డు, రాటకొండవీధి ప్రాంతాల్లో రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అమ్మవారు, వివిధ దేవతామూర్తుల కటౌట్లు విద్యుత్ అలంకరణతో ఏర్పాటు చేశారు. జాతర పురస్కరించుకుని ఆలయం వద్ద భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే అన్ని ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు పూర్తి

జాతర పురస్కరించుకుని భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. క్యూ లైన్లు ,చలువ పందిళ్లు వేశారు. ఆలయ పరిసర ప్రాంతాలు ఇప్పటికే జాతర వాతావరణం నెలకొంది. జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతాల నుంచి రానున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చౌకదుకాణాల ముందు కార్డుదారుల పడిగాపులు

- ఈపోస్ యంత్రాలు పని చేయక డీలర్లకు తప్పని తిప్పలు



చౌకదుకాణం వద్ద పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

తంబళ్లపల్లె: ప్రభుత్వం నిత్యావసర సరుకుల పంపిణీలో ఎండీయూల వ్యవస్థను రద్దు చేసి చౌకదుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలని ఆదేశించింది. ఆదివారం ఉదయమే చౌకదుకాణ డీలర్లు దుకాణాలు తెరిచి బియ్యం పంపిణీ చేసేందుకు సమాయత్తమయ్యారు. తంబళ్లపల్లె చౌకదుకాణాలలో సాంకేతిక లోపాలతో సర్వర్ సహకరించక ఈపోస్ పంపిణీ యంత్రాలు మొరాయించాయి. దీంతో పంపిణీ ఆలస్యమైంది. పలు చోట్ల డీలర్లు ఏమి చేయలో దిక్కుతోచక జుట్టు పీకోవాల్సి వచ్చింది. అప్పటికే కార్డుదారులు క్యూలో నిలబడలేక దుకాణాల ముందే కూర్చుని పడిగాపులు కాయాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావడంతో మొదటి రోజు బియ్యం కోసం ఎక్కువ మంది రాలేకపోయారు. బియ్యం తీసుకున్న వారు మండుటెండలోనే మోసుకోవాల్సి వచ్చింది. పలువురు ప్రభుత్వంను నిందిస్తూ చేసేది లేక నిట్టూర్చారు.

ప్రతిభా విద్యార్థులకు బహుమతులు



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న బండపల్లి వెంకటరమణ

మదనపల్లె సిటీ: ఐకమత్యంతో కలిసిమెలసి సంఘ సంక్షేమం కోసం సాధించుకోవాల్సిన అవసరం ఉందని అఖిల భారత గాండ్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బండపల్లె వెంకటరమణ అన్నారు. ఆదివారం దివంగత గ్రోస్ గోపాలకృష్ణయ్య స్మారక సమావేశం జరిగింది. పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ అందజేశారు. గాండ్ల కులస్తులందరూ ఐక్యంగా ఉంటే ఏమైనా సాధించవచ్చునన్నారు. కులవృత్తి అయిన ఆయిల్ రోటరీ ఏర్పాటుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.వి.రమణ, యువజన అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

సంబేపల్లె : మండల పరిధిలోని పీఎస్‌కాలని గ్రామం నగరిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం వేదపండితులు సాయి స్వామి ఆధ్వర్యంలో హోమాలు, స్వామివారి ఉత్సవ విగ్రహాలు గ్రామోత్సవం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మహోత్సవానికి మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం స్వామివారి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సఖ్యలో పాల్గొనాలని కోరారు.

జిల్లా జూనియర్ బాలికల హాకీ జట్టు ఎంపిక



జూనియర్ బాలికల హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో ఆదివారం జిల్లా జూనియర్ బాలికల జట్టును ఎంపికచేశారు. జిల్లా పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు ఎంపికకు వచ్చారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 18 మందిని ఎంపిక చేసినట్లు సెలక్షన్ కమిటీ సభ్యులు జలజ, ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈనెల 6వతేదీ నుంచి 9వతేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపిక కార్యక్రమంలో కోచ్‌లు గౌస్, దిలీప్, విష్ణు పాల్గొన్నారు.